క్లుప్తంగా

చర్యలు తీసుకోవాలి



ములుగు రూరల్ : ఉపాధిహామీ పనుల్లో అవినీతికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ మండల కార్యదర్శి జన్ను దేవేందర్ అన్నారు. గురువారం మల్లంపల్లి మండలంలోని భూపాల్‌నగర్‌లో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఉపాధి హామీ జాబ్ కార్డులు గ్రామంలో లేని వారి పేరున తీసుకోని పనులు చేయకపోయిన హాజరు వేసి డబ్బులు దండుకున్నారని అన్నారు. ఆగస్టు 27నుంచి ఈ నెల 3వ తేదీ వరకు డీఆర్పీ సౌజన్య సర్వే నిర్వహించారని, సీనియర్ మేట్ వెంకన్న సుమారు రూ.10 నుంచి రూ.15లక్షల వరకు అవినీతికి పాల్పడ్డాడని తెలిపారు. అవినీతికి పాల్పడిన మేట్ వెంకన్నను తొలగించాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

యువకుల బైండోవర్

ములుగు రూరల్ : గంజాయి తాగుతూ పట్టుబడిన ములుగు, వెంకటాపురం(ఎం)మండలాలకు చెందిన 8 మంది యువకులను ములుగు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామాల్లో యాంటీడ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి కమిటీల ద్వారా సమాచారం అందుకొని గంజాయి తాగుతున్న యువకులను గుర్తించి అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. అనంతరం తహసీల్దార్ విజయభాస్కర్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

గొడవలు వద్దు.. రాజీ ముద్దు



రాజు, ఎస్సై

వెంకటాపురం(ఎం) : వివాదాలు పెంచుకుంటే జీవితకాలం కొనసాగుతాయని, గొడవలు వద్దు..రాజీ ముద్దు అనే నినాదంతో ప్రతి ఒక్కరూ రాజీపడుతూ కలిసి ఉండాలని వెంకటాపురం ఎస్సై చల్ల రాజు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 13న ములుగు కోర్టులో నేషనల్ లోక్ అదాలత్ ఉందని పేర్కొన్నారు. యాక్సిడెంట్, తగాదా, వివాహానికి సంబంధించిన కేసులు, దొంగతనం కేసుల్లో రాజీపడేవారు లోక్ అదాలత్‌కు హాజరై కేసులను పరిష్కరించుకోవాలని ఎస్సై సూచించారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు



వాజేడు : మండల పరిధిలోని పూసూరు, ముల్లెకట్ట బ్రిడ్జి వద్ద అధికారులు నిమజ్జన ఏర్పాట్లు చేశారు. గోదావరి బ్రిడ్జి నుంచి పావన గోదావరిలో వినాయక ప్రతిమలను అధికారుల సమక్షంలో నిమజ్జనం చేయనున్నారు. వాజేడు, ఏటూరునాగారం జాయింట్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రెండు మండలాల అధికారులు దగ్గర ఉండి పనులను చేయిస్తున్నారు. గురువారం బ్రిడ్జిపై శుభ్రం చేయించారు. గణపతి విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

విజయవంతం చేయాలి

ఏటూరునాగారం : ఈనెల 7వ తేదీన గిరిజన భవన్‌లో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ నాయకులు బుచ్చయ్య, రాజు, కొమురం లక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని కొమురం భీం విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఐటీడీఏ పాలకమండలి సమావేశం, లంబాడీల తొలగింపుపై చర్చలు ఉంటుందన్నారు. అన్ని వర్గాల ఆదివాసీ నాయకులు, మహిళలు, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని అన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



వెంకటాపురం(కె) : విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సారయ్య, రామ్మూర్తి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బి అతిథి గృహం ఆవరణంలో విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2023 నాటి పీఆర్సీని అమలు చేయాలని అన్నారు. అన్ని వైద్యశాలల్లో ఆరోగ్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాల్వ సుందర్‌రావ్, కార్యదర్శిగా కేఎల్ఎన్ ఆచార్యులు, కోశాధికారిగా జాపతి వెంకన్నను ఎన్నుకున్నారు.

మురుగును తొలగించరూ!

- దోమల వ్యాప్తితో విషజ్వరాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని గ్రామ కార్యదర్శి



డ్రెయినేజీలో నిలిచిన మురుగునీరు



బోరునుంచి వచ్చిన మురుగునీరు

కన్నాయిగూడెం : మండలంలోని ముప్పనపల్లి గ్రామంలో డ్రెయినేజీ కాల్వలోని మురుగు నీటిని తొలగించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని ప్రధాన రోడ్డుకు ఇరువైపుల డ్రెయినేజీ మంజూరు చేసి నిర్మించారు. కానీ కాల్వలోకి చేరిన మురుగు నీరు బయటకు పోవడానికి సరైనా మార్గం లేకపోవడంతో వాటిని తొలగించాలని పంచాయతీ అధికారులకు చెప్పిన వారు దృష్టిసారించడం లేదు. దీంతో వచ్చిన నీరు అక్కడే నిలిచి ప్రజలకు దుర్గంధం వాసనతో పాటు మురుగు నీటిలో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. వాటితో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. డ్రెయినేజీలో నీరు నిల్వ ఉండడంతో అందుబాటులో ఉన్న బోరులోకి చేరి కలుషితం అవుతున్నాయి. నిల్వనీటిని తొలగించాలని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించిన ఫలితం లేకుండా పోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి శుభ్రం చేయాలని కోరుతున్నారు.

బోరునుంచి మురుగు నీరు

ముప్పనపల్లికి చెందిన అబ్బు సంపత్ ఇంటివద్ద మురుగునీరు భారీగా చేరింది. దీంతో ఇంటి చుట్టూ పక్కల వారు ఇబ్బంది పడుతున్నారు. చాలా మంది రోగాలబారిన కూడా పడినట్లు వారు తెలుపుతున్నారు. నీరు నిల్వడంతో పక్కనే ఉన్న బోరులో నుంచి మురుగు నీరు వస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఎన్నిసార్లు గ్రామ పంచాయతీ కార్యదర్శికి చెప్పిన వారు పట్టించుకోవడం లేదని వాపోయారు.

డ్రెయినేజీలు శుభ్రం చేయాలి



గ్రామంలో ఉన్న డ్రెయినేజీలను తొలగించి దోమలు లేకుండా చేస్తే బాగుంటుంది. మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు చేరడంతో వాటితో రోగాలు వస్తున్నాయి. మురుగు తొలగించాలని చెప్పిన ఎవరు పట్టించుకోవడం లేదు.

– అబ్బు సంపత్, ముప్పనపల్లి

యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న రాజుయాదవ్

ములుగు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ మల్లంపల్లి మండల యూత్ అధ్యక్షుడు మొర్రి రాజుయాదవ్ ఆరోపించారు. గురువారం మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటలకు యూరియా అవసరం ఉండడంతో రైతులు క్యూలలో రోజుల తరబడి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముందస్తుగా పంటలు సాగు చేసిన వరి చిరుపొట్టదశలో ఉందని యూరియా లేక పంటలు నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు.అధిక వర్షాల వల్ల నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని కోరారు. నాయకులు చీదర్ల సంతోష్, సురేష్, చోటుమహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి



దివ్యాంగుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సాంబయ్య

ములుగు : దివ్యాంగుల్లో ప్రత్యేక సామర్థ్యాలను గుర్తించి తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని సమగ్ర శిక్ష ఐఈ కోఆర్డినేటర్ గుళ్లపల్లి సాంబయ్య పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని భవిత సెంటర్‌లో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల ఎంపిక నిర్ధారణ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. దివ్యాంగ విద్యార్థులు సంకల్పంతో ముందుకెళ్లాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో 65మంది దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ తిరుపతి, అన్ని మండలాలకు చెందిన ఐఆర్‌టీలు పాల్గొన్నారు.

ఏజెన్సీలో విద్యను బలోపేతం చేయాలి



సర్వేశ్వర్‌రెడ్డికి మొక్క అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె) : ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యను బలోపేతం చేయాలని ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కొర్స నర్సింహమూర్తి అన్నారు. గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు సర్వేశ్వర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించి 12ఏళ్లు గడిచిందని ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలో సుమారు 100 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని అన్నారు. వెంకటాపురం(కె) మండలంలోని కలిపాక, పెద్దగొల్లగూడెం గిరిజన పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేరని వెల్లడించారు. ఆశ్రమ పాఠశాలల్లో మెనూ అమలు చేయడం లేదని వివరించారు. పాఠశాలల్లో వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ విషయంపై స్పందించిన గిరిజనశాఖ అదనపు సంచాలకులు ఏజెన్సీ విద్యను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాసం నాగరాజు, ముర్రం రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



ఏటూరునాగారం: రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేస్తున్న ప్రిన్సిపాల్ రేణుక, అధ్యాపకులు



వాజేడు: రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని అధ్యాపకులు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రేణుక రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు అధ్యాపకులకు శాలువా, పుష్పగుచ్ఛాలతో సన్మానించి అధ్యాపకుల ఆశీస్సులు తీసుకున్నారు. అధ్యాపకులు డి.నవీ న్, వెంకటయ్య, పి. జ్యోతి, కనీస్ ఫాతిమా, సంపత్, జీవవేణి, రమేష్, శ్రీధర్, రాజశేఖర్, భావన, భాస్కర్, భారతి,శ్రీకాంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

వాజేడు : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు సోయం ఆనందరావు మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యారంగానికి చేసిన సేవలను కొనియాడారు. పలువురు ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలతో సన్మానించారు. స్వరూప్‌సింగ్, మల్లయ్య, వెంకటరమణ, ఆనంద్, శ్రీకాంత్, ప్రభాకర్, రాజేష్, రాజ్యలక్ష్మి, శ్రీరంగం, వస్య తదితరులు ఉన్నారు.

ఆశ కార్యకర్తలు పోరాటాలకు సిద్ధం కావాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తలు, నాయకులు

ఏటూరునాగారం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీల సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో తెలంగాణ ఆశ వర్కర్ యూనియన్ జిల్లా 3వ మహాసభలు మడే శ్రావ్య, బొగ్గం సరిత అధ్యక్షతన నిర్వహించారు. మహాసభ ప్రారంభానికి ముందు ర్యాలీ నిర్వహించారు. జయలక్ష్మి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్ఎం స్కీంకు నిధులు తగ్గిస్తూ ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించకుండా కార్మిక చట్టాలకు దూరం చేసే విధంగా పూనుకుందని ధ్వజమెత్తారు. ఆశ వర్కర్లను పారితోషికాల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమ దోపిడీకి గురి చేస్తున్నాయని అన్నారు. ఆశ వర్కర్లకు రూ.26వేలు కనీస వేతనం వెంటనే చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. హెల్త్ కమిషనర్ హామీ ప్రకారం యూనిఫాంలు, ప్రమాద బీమా జీఓ వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఆశ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ నీలాదేవి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ దావూద్, రత్నం రాజేందర్, ఉపాధ్యక్షులు కొప్పుల రఘుపతి, కట్ల నరసింహాచారి, గుండెబోయిన రవిగౌడ్, మడే రవి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సరోజన, సమ్మక్క, ఆశ యూనియన్ నాయకురాలు అరుణ, కాలిక, కాసింబి, ప్రభావతి , రజిత, దేవి, పాప, రమాదేవి సుమారు 300 మంది పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం



గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

ములుగు రూరల్ : గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న సంఘటన ములుగు జిల్లా కేంద్రంలోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఇంచర్ల గ్రామానికి చెందిన లద్దునూరి పవన్ గంజాయి రవాణా చేస్తున్నాడని నమ్మదగిన సమాచారం అందింది. ఈమేరకు ద్విచక్ర వాహనంపై ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో వాహనం తనిఖీ చేశామని పోలీసులు తెలిపారు. వాహనంలో 360 గ్రాముల ఎండు గంజాయి లభ్యమయిందని, పంచనామా నిర్వహించి యువకుడిపై కేసు నమోదు చేసి గంజాయి, వాహనం, మొబైల్ ఫోన్‌ను సీజ్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



ములుగు రూరల్: లైబ్రరీకి పుస్తకాలు అందించిన జనని ఫౌండేషన్ సభ్యులు



సింధుకు పుస్తకాలు అందజేస్తున్న నాయకులు

ములుగు/ములుగు రూరల్ : విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో లైబ్రరీ నిర్వాహణకు జనని ఫౌండేషన్ అధినేత డాక్టర్ రాజా పుస్తకాలను అందించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. లైబ్రరీ నిర్వాహణకు పుస్తకాలు అందించిన జనని ఫౌండేషన్ అధినేతను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

యువతికి పుస్తకాల అందజేత

మంగపేట : మండలంలోని కమలాపురం భగత్‌సింగ్ నగర్‌లో ఇటీవల ఇళ్లల్లోకి ఎర్రవాగు వరదనీరు చేరడంతో పుస్తకాలు నీటమునిగి పోయాయి. దీంతో పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్న చింతం సింధుకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు ద్వారా అతడి సోదరుడు ప్రదీప్‌రావు రూ.9,500 విలువైన కొత్త పుస్తకాలను గురువారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బాడిష నాగరమేష్, మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్, డైరెక్టర్ లక్ష్మణ్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు



మంగపేట: బోరునర్సాపురంలో వినాయకుడి మండపం వద్ద పూజలు చేస్తున్న మహిళలు



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

మంగపేట : మండలంలోని గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వరుడికి భక్తులు గురువారం పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పద్మశాలివాడ, బోరునర్సాపురం, పాతనర్సాపురం, మొట్లగూడెం, కమలాపురం తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం నిర్వహించారు.

భక్తులకు అన్నదానం

కన్నాయిగూడెం : మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణపతి మండపాల వద్ద వినాయక కమిటీ సభ్యులు, యువకులు, రాజకీయ నాయకులు అన్నదానాలు ఏర్పాటు చేశారు. గురువారం మండలంలోని కొత్తూర్, లక్ష్మీపురం గ్రామాల్లోని వినాయక మండపాల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.



కన్నాయిగూడెం : లక్ష్మీపురంలో..



కన్నాయిగూడెం: కొత్తూర్‌లో..

ఆత్మహత్యకు అధికారులే కారణం

- 8 గంటల పాటు ధర్నా నిర్వహించిన పారిశుద్ధ్య కార్మికులు
- సంఘీభావం తెలిపిన విపక్షాల నాయకులు



మున్సిపాలిటీ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, కార్మికులు



కార్మికులకు సంఘీభావం తెలిపి ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

ములుగు : ములుగు మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుడు మైదం మహేష్ ఆత్మహత్యకు అధికారులే కారణమంటూ మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట మహేష్ కుటుంబసభ్యులతో పాటు పారిశుద్ధ్య కార్మికులు గురువారం ధర్నా చేపట్టారు. ఐదు నెలలుగా వేతనాలు రాకపోవడంతోనే మహేష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ధర్నా నిర్వహించారు. కార్మికుడి మృతికి కారణమైన అధికారులను వెంటనే సస్పెండ్ చేసి బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించాలని కార్మికులు డిమాండ్ చేశారు. కార్మికుల ధర్నా సమాచారం తెలుసుకున్న ఎమ్మార్పీఎస్, సీపీఐ, సీపీఎం, బీజేపీ నాయకులు కార్మికులకు సంఘీభావంగా ధర్నాలో పాల్గొన్నారు. అధికారులు పలుసార్లు కార్మికులచే చర్చలు జరిపిన విఫలం అయ్యాయి. చివరకు అదనపు కలెక్టర్ సంపత్‌రావు, మున్సిపల్ కమిషనర్ సంపత్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడం, మృతుని భార్యకు ఉద్యోగ అవకాశం, పిల్లలకు ప్రభుత్వ వసతి గృహాల్లో ఉచిత విద్య అందించేందుకు కృషి చేస్తామని కుటుంబసభ్యులకు హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నా విరమించారు. తక్షణ సహాయం కింద బాధిత కుటుంబానికి రూ.50 వేల నగదు అందించారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నాయకులు జంపాల రవిందర్, అమ్జద్‌పాషా, బోడ రమేష్, రత్నం రాజేందర్, ఎమ్మార్పీఎస్ నాయకుడు నెమలి నర్సయ్య, బీజేపీ నాయకులు సిరికొండ బలరాం, చింతలపూడి భాస్కర్‌రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

ములుగు మున్సిపాలిటీ, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో మృతిచెందిన పారిశుద్ధ్య కార్మికుడు మైదం మహేష్ కుటుంబానికి ప్రభుత్వం రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మహేష్ కుటుంబ సభ్యులు, పారిశుద్ధ్య కార్మికులకు ఆమె సంఘీభావం తెలిపి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ.. మహేష్‌కు ఐదునెలలుగా వేతనం చెల్లించకుండా అధికారులు ఇబ్బందులకు గురి చేయడంతో మనోవేదనకు గురైన అతను పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేష్‌రెడ్డి, నాయకులు పోరిక గోవింద్‌నాయక్, చెన్న విజయ్, వేములపల్లి భిక్షపతి, దుర్గం రమణయ్య, పోరిక విజయరామ్ నాయక్, కోగిల మహేష్, ఆకుతోట చంద్రమౌళి, సమ్మయ్య, శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శి సస్పెన్షన్, బిల్ కలెక్టర్ తొలగింపు

ములుగు మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుడు మైదం మహేష్ ఆత్మహత్యకు కారణమైన అప్పటి ములుగు ఈఓ, ప్రస్తుతం పస్రా పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న పి.రఘును సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ దివాకర టీఎస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుడు మహేష్‌కు సంబంధించిన వేతనాన్ని పంచాయతీ కార్యదర్శి రఘు..సెక్షన్ క్లర్క్‌కు చెల్లించక పోవడం మూలంగానే ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించామన్నారు. మున్సిపాలిటీలో పార్ట్ టైం బిల్ కలెక్టర్ కిరిటీ కూడా కార్మికుడు మహేష్‌కు వేతనం చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యహరించినందున ఆయనను విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించినట్లు వెల్లడించారు.

నీళ్ల బాటిల్ అనుకొని గడ్డిమందు తాగి.. మృతిచెందిన పారిశుద్ధ్య కార్మికుడు

ములుగు రూరల్ : నీళ్ల బాటిల్ అనుకొని గడ్డిమందు తాగి.. ఓ పారిశుద్ధ్య కార్మికుడు మృతి చెందిన సంఘటన జిల్లాకేంద్రంలోని మాధవరావుపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. మాధవరావుపల్లి గ్రామానికి చెందిన మైదం మహేష్(36) మున్సిపల్‌లో తాత్కాలిక పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. మద్యం మత్తులో మంగళవారం రాత్రి ఇంటికి వెళ్లి మంచినీళ్ల బాటిల్ అనుకొని గడ్డిమందు తాగాడు. గమనించిన భార్య చుట్టుపక్కల వారి సాయంతో ములుగు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య సమత ఫిర్యాదు మేరకు తన భర్త మరణానికి కుటుంబ సభ్యులు గాని, ఎవరిపై ఎలాంటి అనుమానం లేదని ఇచ్చిన దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

బస్సులు నిలపడం లేదు

ములుగు రూరల్ : జాకారం మినీ గురుకులం, గిరిజన యూనివర్సిటీ, సెల్ఫ్ మెనేజ్‌మెంట్ హాస్టల్స్, పోలీస్ ట్రైనింగ్ సెంటర్ల వద్ద ఆర్టీసీ బస్సులు నిలపడం లేదని జాకారం మినీ గురుకుల పాఠశాల ఉపాధ్యాయురాలు వాంకుడోత్ నిర్మల గురువారం ఆరోపించారు. ఉదయం విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న ఉద్యోగులకు గురుకులం వద్ద బస్సులు నిలపకపోవడంతో సమయానికి చేరుకోలేక పోతున్నామని అన్నారు. సాయంత్రం సమయంలో ఆర్టీసీ డ్రైవర్లు బస్సులు నిలపాలని రెక్వెస్ట్ చేసి నిలపకుండా వెళ్తున్నారని అన్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

జాబితా నుంచి తొలగించాలి

వెంకటాపురం(కె) : లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ అన్నారు. గురువారం గొండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపీ సోయం బాబురావులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు.

ఉద్యోగికి విరమణ సహజం

మంగపేట : ప్రతి ఉద్యోగికి విరమణ సహజమని ఎంఈఓ పొదెం మేనక అన్నారు. మండంలోని కమలాపురం ఎంపీపీఎస్‌లో ఎఫ్ఎల్‌హెచ్ఎం చింత లక్ష్మీనారాయణ ఉద్యోగ విరమణ కార్యక్రమం మేనక ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యార్థులు ఆయనను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు.